క్లుప్తంగా

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తా

అమీన్‌పూర్ సీఐ నరేష్


సీఐగా బాధ్యతలు స్వీకరించిన నరేష్

పటాన్‌చెరుటౌన్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని అమీన్‌పూర్ సీఐ నరేష్ అన్నారు. బుధవారం సీఐగా నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఐ సదానాగరాజు బదిలీపై హైదరాబాద్ మల్టీజోన్-2కు వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో డీఎస్‌బీ మహబూబ్‌నగర్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో ముందు ఉంటానని, ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తానని తెలిపారు.

నకిలీ ఎరువుల అమ్మితే చర్యలు


స్టాక్ రికార్డు పరిశీలిస్తున్న నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): రైతులకు నకిలీ పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని తడ్కల్ గ్రామంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఎక్కువ ధరలకు, నకిలీ పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సంబంధిత డీలర్లకు హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు నిర్దేశిత ధరలకు అమ్మాలని సూచించారు. ఆయా దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

50 శాతం పన్ను వసూలు


కార్యదర్శులతో మాట్లాడుతున్న యూసుఫ్

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం పరిధిలోని గ్రామపంచాయతీల్లో పన్నులు వసూలు 50 శాతం పూర్తి చేసినట్లు ఎంపీఈఓ యూసుఫ్ తెలిపారు. 38 గ్రామపంచాయతీల్లో రూ.3 కోట్ల 75 లక్షల 122 రూపాయలు వసూలు డిమాండ్ ఉండగా ఇప్పటివరకు 50 శాతం వసూలు చేశామన్నారు. మార్చి నాటికి వందశాతం వసూలు చేస్తామని చెప్పారు. పన్నుల వసూల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించమని హెచ్చరించారు. ప్రత్యేక దృష్టి పెట్టి ఇంటింటికి తిరిగి ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశించారు.

టీజీ ఐపాస్ ఏర్పాటుకు భూసేకరణ


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా భూ సేకరణకు సంబంధించిన స్థలాన్ని ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలను ప్రోత్సహించేలా టీజీ ఐపాస్‌కు భూ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. అనువైన స్థలంతో పాటు వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, ఆర్ఐ పవన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు


జొన్నపంటను పరిశీలిస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): జొన్నసాగులో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కృష్ణాపూర్‌లో జొన్న, వరిసాగు పనులు పరిశీలించారు. పంటలకు కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని తెలిపారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలన్నారు.

వట్‌పల్లికి సహకారం లేనట్టేనా?

- 7 సొసైటీలకు మాత్రమే ప్రతిపాదనలు
- రుణాలకు 16 గ్రామాల రైతులు దూరం


వట్‌పల్లి గ్రామ వ్యూ

వట్‌పల్లి(అందోల్): రైతులకు వెన్నుదన్నుగా నిలిచే సహకార సంఘం ఏర్పాటు వట్‌పల్లి మండల రైతులకు లేనట్లేనా.. అన్న సందేహం నెలకొంది. రైతులకు పంట రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వెహికల్ లోన్స్ వంటి సదుపాయాలను కల్పిస్తాయి. కొత్త సొసైటీ ఏర్పాటు చేయాలని గతంలో 15 గ్రామాల రైతులు ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. 2019లో జిల్లాలో 22 చోట్ల సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వట్‌పల్లిలో సొసైటీ ఏర్పాటుకు అప్పటి అధికారులు ప్రతిపాదనల్లో చేర్చారు. ఇటీవల జిల్లాలో కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో జిల్లాలోని 7చోట్ల నాగల్‌గిద్ద, తడ్కల్, నిజాంపేట, జహీరాబాద్, వడ్డెపల్లి, మునిపల్లి, ఆత్మకూరు సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదించారు. నివేదికలో వట్‌పల్లిని చేర్చకపోవడంపై ఆయా గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రుణాలకు ఇంకెంత కాలం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో భాగంగా అల్లాదుర్గం, రేగోడ్ మండలాలను విడదీసి వట్‌పల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేశారు. ఖాదిరాబాద్, ఉసిరికపల్లి, దరఖాస్తుపల్లి, నిర్జప్ల, సాయిపేట గ్రామాల రైతులకు ఖాదిరాబాద్ పీఏసీఎస్ పరిధిలో ఉండడంతో వారికి ఆ సొసైటీ ద్వారా రుణాలు అందుతున్నాయి. మిగతా 16 గ్రామాలు మెదక్ జిల్లాలోని మాత్ర మండలాల పరిధిలోని సొసైటీల పరిధిలోనే ఉన్నాయి. దీంతో జిల్లా మారిందని అక్కడివారు.. మీ పేర్లు మా సొసైటీలో లేవని ఇక్కడి వారు కొత్త రుణాలను ఇవ్వడం లేదు.

కొత్త పీఏసీఎస్‌ను ఏర్పాటు చేయాలి



మండలంలోని 16 గ్రామాల రైతులకు ఒకే సొసైటీ ఉండడంతో ఎరువులు, విత్తనాల ఇతరాత్ర అవసరాల కోసం క్యూ కట్టవలసి వస్తుందని పలుమార్లు అధికారులకు విన్నవించాం. అప్పటి ప్రతిపాదనల్లో వట్‌పల్లిని చేర్చినప్పటికీ ప్రస్తుతం దానిని పక్కన పెట్టడంతో రైతులకు ఇబ్బందులు తప్పేలా లేదు. అధికారులు వట్‌పల్లిలో సహకార సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– పి. బుద్ధిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్

నిబంధనల మేరకు ప్రతిపాదించాం

నిబంధనల మేరకే జిల్లాలో 7 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. 2019లో జిల్లాలో 22 సహకార సంఘాల ఏర్పాటు చేయాలని పంపించిన విషయం వాస్తవమే. కొత్త సంఘాల ఏర్పాటు విషయంలో గ్రామాల సంఖ్యతో పాటు సంఘం ఆదాయం వృద్ధి పరచడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటాం..

– కిరణ్, డీసీఓ సంగారెడ్డి జిల్లా

రింగురోడ్డుతో భూముల ధరలకు రెక్కలు


రైతులతో మాట్లాడుతున్న శంకర్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూ నిర్మిస్తున్న రింగురోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్ పరిశీలించారు. వేంకటేశ్వర ఆలయం నుంచి డీఎస్పీ కార్యాలయం సమీపంలోని నిజాంపేట- ఖేడ్ -బీదర్ జాతీయ రహదారి వరకు కొనసాగుతున్న లింక్‌రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. ఈ రోడ్డు వల్ల చుట్టుపక్కల భూముల ధరలు పెరగడమే కాకుండా సమీప కాలనీల వారికి రోడ్డు సదుపాయం ఏర్పడుతుందని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నామమాత్రంగా కూల్చారని గ్రామస్తుల ఆరోపణ


అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న జేసీబీ

జిన్నారం (పటాన్‌చెరు): అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టారు. జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 10లో అక్రమంగా గృహాలను నిర్మించారని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్ నారాయణ చర్యలు చేపట్టారు. 8 గృహాలు నిర్మించగా వాటిలో మూడింటిని జేసీబీతో నేలమట్టం చేశారు. నిర్మాణాలు అన్నింటిని కూల్చివేయకుండా అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌ను వివరణ కోరగా.. కూల్చివేతలు చేయని 5 గృహాలు 59 జీఓ పరిధిలో ఉన్నాయని అందువల్ల వాటిని మినహాయించామన్నారు. గ్రామస్తులు అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో ఎండుతెగులు నివారణ

ఏడీఏ నూతన్ కుమార్


సూచనలు చేస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి శనగ పంటలో ఎండుతెగులు నుంచి పంటను కాపాడుకోవాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని జమ్గి(కే) గ్రామ శివారులో శనగ, మొక్కజొన్న పంటలను ఏఈఓ భార్గవ్‌తో కలిసి పరిశీలించారు. శనగలో ఎండు తెగులు సోకి ఎండుతున్న మొక్కలను పీకివేసి పంటకు దూరంగా కాలిచ్చివేయడంతో పాటు పంట మొదళ్లలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, ఒక లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ల తడిసేట్లు పోయాలని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు సోకి ఎదుగుదల ఆగిపోతుందన్నారు. నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు మొక్కల మొగిలో వేయాలన్నారు. లేదా ఇమామెక్టిన్ బెంజాయిట్ రసాయనం పిచికారీ చేయాలని సూచించారు.

ఆయా గ్రామాల్లో 'సూపర్ చెక్' పరిశీలన


సూపర్ చెక్ యాప్‌తో సర్వే చేస్తున్న ఎంపీడీఓ

కంగ్టి(నారాయణఖేడ్): సర్వే పూర్తవుతున్న క్రమంలో ఎంపీడీఓ సత్తయ్య ఆధ్వర్యంలో ఎంపీఓ సుభాష్‌తో కలిసి బుధవారం ముకుందతండా, తడ్కల్ గ్రామాల్లో సర్వేలో ఖచ్చితత్వం కోసం 'సూపర్ చెక్' పరిశీలించారు. పంచాయతీ సెక్రటరీలు, ఇందిరా క్రాంతి పథకం సిబ్బంది నిర్వహించిన సర్వే దాదాపు పూర్తయినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రతీ గ్రామంలో 5 శాతం సూపర్ చెక్ యాప్ ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తీసిన ఫొటోకు సూపర్ యాప్ ఫొటో మ్యాచ్ అయితేనే సర్వేలో ఖచ్చితత్వం ఉన్నట్లని ఎంపీడీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సర్దార్ రాథోడ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్హేర్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను ఎంపీడీఓ రమేష్‌బాబు బుధవారం పరిశీలించారు. కల్హేర్, మాసాన్‌పల్లి, కృష్ణాపూర్, తదితర చోట్ల సర్వే పనులను సూపర్ చెక్ చేశారు.

98శాతం సర్వే పనులు పూర్తి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలో 98 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయిందని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం సంగారెడ్డి మండలంలోని పలు గ్రామంలో ఎంపీడీఓ సర్వే బృందం చేస్తున్న పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా?

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


మౌనప్రదర్శన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు, అగ్రనాయకుల మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. బుధవారం అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ జోగిపేటలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన జరుగుతుంది. నీవే కాపాడాలి అంటూ విగ్రహం వద్ద మొర పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

జహీరాబాద్ టౌన్: శబరిమలకు జహీరాబాద్ డిపో నుంచి బుధవారం ప్రత్యేక బస్సు సర్వీస్‌ను డీఎం జాకీర్ హుసేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతం నుంచి శబరిమల వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2023-24 విద్యా సంవత్సరంలో పదవతరగతి వార్షిక పరీక్షల్లో పాఠశాల స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు వైష్ణవి, సానియాలకు బుధవారం పోల ఫౌండేషన్ తరఫున సిల్వర్ మెడల్స్ పోల శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని విధ్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష పడింది. పటాన్ చెరులో ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన తొమ్మిది మందిని సంగారెడ్డి కోర్టుకు తరలించారు. వీరిలో ఐదుగురికి రూ.2000 చొప్పున, ముగ్గురికి రూ.15 చొప్పున, మరో వ్యక్తికి రూ.1500 జరిమానాతో పాటు జైలు శిక్ష న్యాయమూర్తి విధించారని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పనుల్లో వేగం పెంచండి



కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీలో భాగంగా వననర్సరీలో పెంచుతున్న మొక్కలు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సత్తయ్య ఆదేశించారు. మండలంలోని జమ్గి(కే) గ్రామంలో నిర్వహిస్తున్న వననర్సరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్యాకెట్లలో ఫిల్లర్ మట్టి నింపడంతో పాటు విత్తనాలు నాటే పనులు వేగవంతం చేయాలని సూచించారు. మండలంలోని అన్నీ నర్సరీల్లో ప్యాకెట్ ఫిల్లింగ్‌తో పాటు విత్తనాలు వేసి మొక్కలు త్వరితగతిన పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి టీఏ రవీందర్‌రెడ్డి, గణపతి, ఫీల్డ్ అసిస్టెంట్ బాలాజీ, కూలీలు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అఖిలేష్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారులో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం, వసతి, బోధన తీరును తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సారి పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని.. పాఠశాల ప్రత్యేక అధికారిణి బాలమణి, ఉపాధ్యాయులకు సూచించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

మునిపల్లి(అందోల్): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మునిపల్లి మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని అడిగారు.

నాణ్యమైన భోజనం అందించాలి

రాయికోడ్(అందోల్): వసతి గృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్ నిర్వాహకులకు సూచించారు. రాయికోడ్‌లోని కేజీబీవీ, బీసీ వసతి గృహాలతో పాటు ఎస్సీ బాలికల గురుకుల వసతి గృహాలను బుధవారం సందర్శించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు భోజనం సిద్ధం చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు, పంచాయతీ కార్యదర్శులున్నారు.

క్షేత్ర పర్యటనతో సాగుపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మాధవి

జహీరాబాద్ టౌన్: క్షేత్ర పర్యటనతో పంటల సాగుపై అవగాహన కలుగుతోందని సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర మాధవి అన్నారు. హైదరాబాద్‌లోని కొండాలక్ష్మణ్ ఉద్యాన కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థులు మూడు నెలలుగా రంజోల్ గ్రామంలో ఉంటూ పంటల సాగు, రైతుల స్థితిగతులపై అధ్యాయనం చేశారు. బుధవారం రైతువేదికలో విద్యార్థులు సదస్సు నిర్వహించి.. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న విషయాలను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాస్త్రవేత్త మాధవి మాట్లాడుతూ.. పల్లెల్లో పర్యటించడం వల్ల వ్యవసాయంపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తమ అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రదీప్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త శైలజ పాల్గొన్నారు.

నాసిరకం ఆహారాన్ని విక్రయిస్తే చర్యలు

జిల్లా ఆహార భద్రత అధికారి అమృతశ్రీ



పటాన్‌చెరు టౌన్: నాసిరకం ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఆహార భద్రత అధికారి అమృత శ్రీ స్పష్టం చేశారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలోని స్వీట్ హార్ట్ రెస్టారెంట్‌లో ఆమె తనిఖీలు నిర్వహించి టమాటో సాస్, కందిపప్పు నమూనాలను సేకరించారు. అదేవిధంగా హరి దోశ టిఫిన్ సెంటర్లో తనిఖీలు నిర్వహించి అల్లం వెల్లులి పేస్ట్, టీ పౌడర్ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపించారు. ఈ రెండింటికీ ఆమె నోటీసులు జారీ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఉపాధ్యాయుల టీచింగ్, లెర్నింగ్ భేష్**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలను బుధవారం మండల నోడల్ అధికారి సుధాకర్ సందర్శించారు. ఉపాధ్యాయుల టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ సహాయంతో తెలుగు, ఇంగ్లీష్, గణితానికి సంబంధించిన బోధనను పరిశీలించారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో తయారు చేసిన టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌తో బోధన చాలా బాగుందన్నారు.

◆ **ఆటో డ్రైవర్లకు అవగాహన**

పటాన్‌చెరు టౌన్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2025 భాగంగా బుధవారం ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ ఆటోలను పార్కింగ్ చేయొద్దన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు పవన్, రాములు, హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **డ్రైనేజీ పనుల పరిశీలన**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ 15వ వార్డులోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వార్డు కౌన్సిలర్ సంతోషా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అభివృద్ధి పనుల్లో కాలయాపన చేయవద్దన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ స్థానికులు పాల్గొన్నారు.

◆ **ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు**

నారాయణఖేడ్: నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే జరిమానా తప్పదని ఖేడ్ మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్ ఆదేశాలతో బుధవారం పట్టణంలోని పలుదుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని యజమానులకు జరిమానా విధించి రశీదులు అందజేశారు. తరచు గా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

◆ **పదిలో ప్రథమ స్థానంలో నిలవాలి**

మునిపల్లి(అందోల్): జిల్లాలోనే మునిపల్లి మండలం పదవ తరగతిలో అధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవాలని ఎంపీడీఓ హరినందన్‌రావు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని మున్‌సాన్‌పల్లి, తాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పెద్దచల్మెడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతిలో అధిక మార్కులు సాధిస్తేనే ఉన్నత చదువు చదువుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరై ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహేందర్, సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **చైనా మాంజా విక్రయిస్తే చర్యలు**

కల్హేర్(నారాయణఖేడ్): సంక్రాంతి నేపథ్యంలో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం సిర్గాపూర్‌లో గాలిపటాలు విక్రయించే షాపుల్లో తనిఖీ చేశారు. గాలిపటాలు ఎగరవేసేందుకు గాంజా పూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలు ఉపయోగించడంతో పర్యావరణం, పక్షులు, మనుషులకు హాని చేస్తుందని తెలిపారు. ఎవరైనా అమ్మిన, రవాణా చేసినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

◆ **నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉ. 11గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పటాన్‌చెరులో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ జగదీష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ... సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్‌తో పాటు బీఎస్ఎన్ఎల్ ఫీడర్, న్యూమార్కెట్ ఫీడర్, కంజర్ల ఫీడర్ల పరిధిలో సరఫరా అంతరాయం ఉండదన్నారు.

◆ **నిత్యావసర సరుకుల పంపిణీ**



కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని గుంతపల్లిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పడమటి అనంత్ రెడ్డి బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరుతూ గ్రామంలో 440 కుటుంబాలకు గాను 400 కుటుంబాలకు 5 కిలోల మంచినూనెతో పాటు 23 రకాల సరుకులను పంపిణీ చేశారు. గ్రామంలో ఏ ఒక్కరూ పండుగ రోజు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ప్రతి ఇంటికి సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

◆ **నేడు క్రీడాపోటీలు**

నారాయణఖేడ్: మండలంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు గురువారం వాలీబాల్, కబడ్డీ, పరుగుపందెం, టెన్నికాయిట్ పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.జి.నారాయణ తెలిపారు. ఈ మేరకు పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల క్రీడల ఇన్‌చార్జి పోశెట్టి, ఎన్ఎస్ఎస్ యూనిట్ సమన్వయకర్తలు హరి, హవప్ప, శహబాజ్, అరుణ్, జగదేవి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శేరిలింగంపల్లి పరిధిలోని పలు కాలనీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామస్వామి, కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయిబాబాలు మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి పది తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్, కవిత, అధ్యాపకులు అనురాధ, ప్రజ్వల, జ్యోతిర్మయిలు పాల్గొన్నారు.